వైద్యులు లేక పోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సర్కారు దవాఖానలో సమయ పాలన ఏదీ?

- టైం పాటించని మంథని సామాజిక వైద్యశాల డాక్టర్లు

మంథని, ఫిబ్రవరి 24: మంథని సామాజిక వైద్యశాల డాక్టర్లు సమయ పాలన పాటించడం లేదు. విధుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. సమయానికి వైద్యులు రాక పోవడంతో దవాఖానకు వచ్చే రోగులు గంటల తరబడి వేచి చూడాల్సిన వస్తున్నది. సోమవారం ఉదయం దవాఖానలో ఏడుగురు వైద్యులు సేవలు అందించాల్సి ఉండగా, ఆర్ఎంవో డాక్టర్ అఫ్రోజ్ మాత్రమే అందుబాటులో ఉన్నారు.మిగతా డాక్టర్లు విధులకు హాజరు కాలేదు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా, ఉదయం 10 గంటలు దాటినా డాక్టర్లు రాలేదు. దీంతో దవాఖానకు వచ్చిన రోగులు చేసేది ఏమీ లేక క్యూ లో నిల్చొని డ్యూటీలో ఉన్న ఒక్క డాక్టర్ వద్ద పరీక్షలు చేయించుకున్నా రు. ఈ నెల 21న మంథని ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేసి విధుల్లో నిర్లక్ష్యం చూపవ ద్దని సూచించిన విషయం తెలిసిందే. కలెక్టర్ దవాఖానను తనిఖీ చేసినా వైద్యుల్లో ఎలాంటి మార్పు లేకుండా ఇలా విధులకు ఆలస్యంగా హాజరు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలతో దవాఖానకు వచ్చే తాము వైద్యులు స మయానికి అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వైద్యులు ఆలస్యంగా విధులకు హాజరు కావడంపై దవాఖాన సూపరిండెంట్ రాజశేఖర్‌ను వివరణ కోరగా హాస్పిటల్‌లోని పక్కవార్డులోని రక్తదాన శిబిరం జరుగుతుండడంతో వల్ల వైద్యులు అక్కడికి వెళ్లారని తెలిపారు.

అంతర్జాతీయ సదస్సులో కొమిరె వాసి ప్రెజెంటేషన్

ప్రెజెంటేషన్ ఇస్తున్న డాక్టర్ మల్లారెడ్డి

ఓదెల, ఫిబ్రవరి 24: పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ఈ నెల 24 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో కొమిరె గ్రామానికి చెందిన డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి మాతృ భాష పై ప్రెజెంటేషన్ ఇచ్చారు. మల్లారెడ్డి తన పరిశోధనాంశాన్ని ప్రెజెంటేషన్ చేశారు. ఈ సదస్సులో మాట్లాడుతూ యునెస్కో ప్రపంచ వ్యాప్తంగా 8324 భాషలను గుర్తిస్తే అందులో సుమారు ఐదవ వంతు భాషలను భారతదేశంలో మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఏర్పడబోతున్న క్రమంలో భారత రాజ్యాంగం కల్పించిన ప్రధాన హక్కులు సమానత్వం, వాక్ స్వాతంత్ర్యం, అందరికీ సమాన విద్యా అవకాశాలు షెడ్యూల్‌లులో లేని, పరిపాలనకు దూరంగా ఉన్న భాషలకు అందుబాటులోకి తీసుకురావడమే తన పరిశోధన లక్ష్యమని మల్లారెడ్డి పేర్కొన్నారు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ (యూపీఐ) తరహాలో యూనిఫైడ్ లాంగ్వేజ్ ఇంటర్ఫేస్(యూఎల్ఐ) రూప కల్పన ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. ఈ సదస్సులో యునెస్కో , వివిధ రంగాలకు చెందిన నిపుణులతో సహా 400 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఇంకెన్నాళ్లకు 'ఎస్‌వో' ఏర్పాటు..?

- నెరవేరని మూడు దశాబ్దాల కల
- తప్పని దూర భారం
- సకాలంలో అందని తపాలా సేవలు

జూలపల్లిలోని బ్రాంచ్ పోస్టాఫీస్

జూలపల్లి, ఫిబ్రవరి 24 : జూలపల్లిలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు మూడు దశాబ్దాల నుంచి కలగానే మిగిలిపోతున్నది. తపాలా సేవలు పూర్తిస్థాయిలో అందక దూరమవుతున్నాయి. ఏండ్ల తరబడి ప్రజలు, ఖాతాదారుల చిరకాల వాంఛ నెరవేరడం లేదు. ఎస్‌వో సేవలు అందక దూర భారంతో అవస్థలు పడుతున్నారు. ఇక్కడి బ్రాంచ్ పోస్టాఫీస్ పరిధిలో జూలపల్లి, అబ్బాపూర్, కోనరావుపేట గ్రామాలు ఉన్నాయి. మూడు గ్రామాలకు కేవలం ఒక జీడీఎస్ డీఏ (పోస్ట్‌మ్యాన్) తపాల సేవలు అందిస్తున్నారు. ఎలిగేడు ఎస్‌వో నుంచి మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల ప్రజాపరిషత్, ఎంఈవో, ఏవో, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల దవాఖాన, విద్యుత్ కార్యాలయం, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు వచ్చే అధికారిక ఉత్తరాలు ఆలస్యంగా చేరుకుంటున్నాయి. కరీంనగర్ నుంచి ఎలిగేడు ఎస్‌వో ద్వారా జూలపల్లికి చేరుకోవడం ఒక రోజు ఆలస్యమవుతున్నది. పత్తి డబ్బులకు పరిమితి విధించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇక్కడ సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలని చాలాసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ప్రజల ప్రయత్నాలు ఫలించడం లేదు. తపాల సేవలు పొందడానికి దాదాపు 12 కిలో మీటర్ల ప్రయాణం చేసి ఎలిగేడుకు వెళ్లాల్సి వస్తున్నది. ఏటా పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాలు బట్వాడా చేయడం తలకు మించిన భారమవుతున్నది. పోలీసులు, పరీక్షల నిర్వహణ అధికారులు ద్విచక్ర వాహనాలపై ఎలిగేడుకు వెళ్తున్నారు. జూలపల్లి బీవో నుంచి ఎస్‌వోకు దాదాపు 75 శాతం ఆదాయం సమకూర్చి పెడుతున్నది. ఎస్‌వో ఏర్పాటుపై అధికారులు స్పందించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన కోట్లాది రూపాయల పత్తి డబ్బులు పోస్టాఫీస్ ద్వారానే చెల్లిస్తున్నారు. సబ్ పోస్టాఫీస్‌లో సరిపడా డబ్బులు చేతికందక ఇబ్బందులు పడుతున్నారు. విదేశాలకు పార్శిళ్లు పంపడం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడానికి అంతదూరం వెళ్లడం భారంగా మారుతుంది. బీవోలో ఎంఎస్ఎస్‌సీ, ఎంఐఎస్, పీపీఎఫ్, సీనియర్ సిటిజన్ స్కీం అకౌంట్లు తెరవడానికి అవకాశం లేకపోవడంతో ఎస్‌వోకు వెళ్తున్నారు. జూలపల్లిలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేసినట్లయితే అన్ని సేవలు సులభతరం కానున్నాయి. బీవో పరిధిలో ఉదయం 8:30 నుంచి 11:30 గంట దాకా ఉన్న పని వేళలు, ఎస్‌వో అయితే సాయంత్రం 4 గంటల వరకు పొడగించి తపాల సేవలు పూర్తి స్థాయిలో అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. అబ్బాపూర్‌ను బీవోగా ఏర్పాటు చేసి, పెద్దాపూర్‌ను చొప్పదండి ఎస్‌వో నుంచి జూలపల్లికి మార్చి ఎస్‌వో హోదా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- 27న పోలింగ్
- పట్టభద్రులకు 36, టీచర్లకు 14 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 24: ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టరేట్‌లో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. జిల్లాలో పట్టభద్రులకు 36, ఉపాధ్యాయులకు 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ విధులపై ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 26న పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్ తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి పోలింగ్ సామగ్రి తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిసరాలను చెక్ చేసుకోవాలని ,100 మీటర్ల రేడియస్‌లో ఎన్నికలను ప్రభావితం చేసేలా ఎటువంటి ప్రచారం జరగడానికి వీలు లేదని స్పష్టం చేశారు. డిప్యూటీ డీఈవో, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఏఆర్వోలు, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగ య్య, సురేశ్ ,తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

సర్వేయర్లు పని తీరు మెరుగుపర్చుకోవాలి

సర్వేయర్లు తమ పని తీరు మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో జిల్లాలోని సర్వేయర్లకు 8 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. భూముల సరిహద్దులు, రికార్డుల నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, సర్వేయర్లు అనిల్, సునీల్, నరేష్, శ్రీనివాస్, కృష్ణప్రియ ,రాధిక, రాజశేఖర్, చారి, రఘుపతి , సాయి చరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీ సాహిద్ మసూద్

రామగుండం బల్దియాలో ఆర్డీ విచారణ

- డీజిల్, వాహనాల కొనుగోళ్లలో అవకతవకలపై ఆరా
- ఆరు గంటల పాటు రహస్యంగా రికార్డుల తనిఖీలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వరంగల్ రీజినల్ డైరెక్టర్ సాహిద్ మసూద్ సోమవారం విచారణ చేపట్టారు. గత ఏడాది నగర పాలక సంస్థలో వాహనాల కొనుగోళ్లు, పారిశుధ్య వాహనాల్లో డీజిల్ లోడింగ్ అంశాల్లో అవకతవకలు జరిగినట్లు వెల్లువెత్తిన ఫిర్యాదులపై సంబంధిత ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులను విచారించారు. దాదాపు ఆరు గంటల పాటు విచారణ జరిగింది. ఇంజినీరింగ్ విభాగం అధికారులు రికార్డులు సమర్పించకపోవడంపై ఆర్డీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీజిల్ లెక్కలు కూడా అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య వాహనాల్లో డీజిల్ తక్కువగా పోసి ఎక్కువగా బిల్లులు పొందుతున్నట్లు 25వ డివిజన్ మహిళా కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు గత ఏడాది విజిలెన్స్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'బల్దియాలో డీజిల్ గోల్‌మాల్' శీర్షికన పలు కథనాలు ప్రచురితమయ్యాయి. విచారణ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు అక్కడకు చేరుకొని ఆర్డీకి ఆధారాలతో సహా చెప్పేందుకు వెళ్లగా లోపలికి అనుమతించలేదు. దీనితో ఆమె అప్పటికప్పుడే హైదరాబాద్‌లోని విజిలెన్స్ డీఐజీకి ఫోన్ ద్వారా ఇక్కడ విచారణ జరుగుతున్న తీరును వివరించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన ఆర్డీని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా, సాధారణ తనిఖీ కోసమే వచ్చామని దాటవేస్తూ వెళ్లిపోయారు. విచారణ అనంతరం ఏమైనా చర్యలు ఉంటాయా? అన్నది తేలాల్సి ఉంది. దాదాపు ఆరు గంటల పాటు సంబంధిత విభాగాల అధికారులను వేరువేరుగా ఉదయం నుంచి సాయంత్రం దాకా సమగ్రంగా విచారణ చేపట్టారు. ఆ నివేదికలను సీడీఎంఏ అధికారులకు సమర్పించనున్నట్లు తెలిసింది. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి తదితరులున్నారు.

కాగా, బల్దియాలో డీజిల్ అక్రమాలపై మళ్లీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సుమలతరాజు తెలిపారు. నాలుగు గోడల మధ్య విచారణ జరిపితే వాస్తవాలు బయటకు రావని పేర్కొన్నారు. విచారణకు వచ్చిన ఆర్డీని కలిసి తన వివరణ ఇవ్వడానికి వెళ్తే లోపలికి అనుమతించలేదని పేర్కొన్నారు.

ఇండ్ల మధ్య కోళ్ల ఫారం పరిశీలన

'నమస్తే' కథనానికి స్పందన

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో ఇండ్ల మధ్య గల కోళ్ల ఫారాన్ని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ భిక్షపతి సందర్శించారు. ఈ మేరకు సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఇండ్ల మధ్య కోళ్ల ఫారం..' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ అధికారులకు ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు సోమవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కోళ్ల ఫారాన్ని సందర్శించారు.అక్కడ పెంచుతున్న కోళ్లు, వాతావరణాన్ని పరిశీలించారు. ఇక్కడి పౌల్ట్రీ ఫాంలో కోళ్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి స్థానిక సంస్థల అదన పు కలెక్టర్, రామగుండం కమిషనర్‌కు నివేదికలు సమర్పిస్తామని కాలుష్య నియంత్రణ మండలి అధికారి భిక్షపతి తెలిపారు. ఆ తదుపరి కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐతే గతంలో కూడా ఇలాంటి తనిఖీలు చేసి షోకాజ్ నోటీసులకే పరిమితం చేశారని, ఈసారైనా శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మేజిక్ రాజాను సన్మానిస్తున్న మెజిషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మేజిక్ రాజాకు సన్మానం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: గోదావరిఖనికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు మేజిక్ రాజాను వరంగల్ మెజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇంద్రజాల పితామహుడు పీసీ సర్కార్ జయంతి పురస్కరించుకొని వరంగల్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో వరంగల్ మెజిషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంద్రజాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా ఇంద్రజాల రంగంలో విశిష్ట సేవలందిస్తున్న సీనియర్ మెజిషియన్ మేజిక్ రాజాను అతిథులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, ఇంద్రజాలికులు పాల్గొన్నారు.

కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్, ఫిబ్రవరి 24: 18నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న పేద మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరేలా ప్రోత్సహించాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం కమిషనర్ జేఅరుణశ్రీ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని మహిళా స్వశక్తి భవన్‌లో నిర్వహించిన రామగుండం పట్టణ మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. కొత్తగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వశక్తి మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్త్రీనిధి, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వార సబ్సిడీ రుణాలు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. అర్హత ఉన్న స్వశక్తి మహిళలు రుణం పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా డీపీఎం సతీశ్, స్త్రీ నిధి మేనేజర్ రాజారావు, మెప్మా టీఎంసీ మౌనిక, రామగుండం పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు లతా మోహన్, కమ్యూనిటీ అర్గనైజర్ ఊర్మిళ, వార్డు సమాఖ్యల ప్రతినిధులు ఉన్నారు.

కార్మికులకు ఆటంకాలు కల్పించొద్దు

గోదావరిఖని, ఫిబ్రవరి 24: సింగరేణిలో జీడీకే 2అండ్2ఏ రోడ్డు క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి అటంకాలు కల్పించవద్దని ఏఐటీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆర్జీ-1 అధ్యక్షుడు ఎంఏ గౌస్ పేర్కొన్నారు. సోమవారం కార్మికులు పని చేస్తున్న పనిస్థలాల్లో కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. సజావుగా పనిచేస్తున్న కార్మికుల లోకేషన్లు మార్చడంతో ఇబ్బందులకు గురవుతారన్నారు. లోకేషన్ల మార్పిడిని విరమించుకొని వారికి ఎలాంటి ఆటంకాలు కల్పించవద్దని యాజమాన్యాన్ని కోరారు. సీఎస్పీ-1లో పనిచేస్తున్న నలుగురు కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసే చోటున ముగ్గురితో పని చేయించడంతో పనిభారం పెరుగుతుందన్నారు. కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఇక్కడ కాంట్రాక్ట్ కార్మికులు కోట వెంకన్న, నాయకులు అంజయ్య, మల్లేశ్, సువర్ణ, సరోజన ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముత్తారం, ఫిబ్రవరి 24: అడవిశ్రీరాంపూర్ శివారులో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న పుప్పాల కమలాకర్, బీ వినోలకు చెందిన ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించారు. ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసినా అడవిశ్రీరాంపూర్, ముత్తారం గ్రామాల నుంచి ఇలా రాత్రి సమయంలో తరలించడం ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టాలని కోరుతున్నారు.

ఘనంగా ఓదెల 'మల్లన్న' కల్యాణోత్సవం

పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఓదెల, ఫిబ్రవరి 24: ఓదెల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మల్లన్న కల్యాణం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే విజయ రమణారావు కుటుంబ సమేతంగా హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయం తరపున ప్రసాదం, కండువాలు పంపిణీ చేశారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో ఈవో సదయ్య, అధికారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. కల్యాణాన్ని వేదపండితులు దూపం వీరభద్రయ్య, మఠం భవానీప్రసాద్, పంచాక్షరి, అభిషేక్, మఠం భద్రయ్య, భువనేశ్వర్‌లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్చక బృందం తదితరులు నిర్వహించారు.

వేములవాడ జాతరకు బల్దియా కార్మికులు

వేములవాడకు వెళ్తున్న పారిశుధ్య కార్మికులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు రామగుండం నగర పాలక సంస్థలోని పారిశుధ్య కార్మికులకు డ్యూటీలు వేశారు. ఈమేరకు సోమవారం నగర పాలక సంస్థ నుంచి 24 మంది పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్‌లో కార్యాలయం నుంచి వేములవాడకు బయలుదేరి వెళ్లారు. మహా శివరాత్రి సందర్భంగా వేములవాడకు దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున అక్కడ పారిశుధ్యం లోపించకుండా ఉండేందుకు ఏటా రామగుండం బల్దియా నుంచి పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకుంటున్నారు. ఈనెల 25 నుంచి జాతర ముగిసేంత వరకు అక్కడ పారిశుధ్య సేవలందించి తిరిగి రానున్నారు.

మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్ష యంత్రం ప్రారంభం

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 24: ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లి గని సెక్టార్-3 డిస్పెన్సరీలో మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్ష యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్జీ-2 జీఎం వెంకటయ్య సోమవారం ఈ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, సత్వరం ఫలితాలు అందిస్తామని మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెక్రెటరీ రవీందర్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి నర్సిహులు, ఎస్ఓటు జీఎం రాముడు, ఏజెంట్ సంతోష్‌కుమార్, డీజీఎం మురళీకృష్ణ, ఇంజనీర్ చంద్రశేఖర్, ఎస్‌వో షరీఫ్ మహ్మద్, సురేశ్ బాబు, వేణు, వైద్యులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అవగాహన సదస్సు

మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, ఫిబ్రవరి 24: ఆర్జీ-1 జీఎం కార్యాలయం సమావేశ హాల్‌లో సోమవారం ఆర్జీ-1 పరిధిలోని ఆయా గనులు, విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సదుస్సు నిర్వహించారు. పని స్థలాలల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులపై నివారణ, నిషేధం, సంస్కరణ చట్టం, సూటబుల్ ఉద్యోగంపై జీఎం చర్చించారు. ఉద్యోగుల పట్ల ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, అధికారుల సంఘం అధ్యక్షుడు మల్లేశం, ఏజీఎం ఈఈడీ ఆంజనేయులు, ఏఐటీయూసీ ప్రతినిధి పద్మ, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీబాయి, కమిటీ సభ్యులు, లా ఆఫీసర్ ఆఫ్రిన్ సుల్తానా, సింగరేణి స్కూల్ తెలుగు పండిట్ శశికళ, మహిళా ఉద్యోగులు ఉన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివెల్

వంటకాలు రుచి చూస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి24 : కాల్వశ్రీరాంపూర్‌లోని క్రీసెంట్ పాఠశాలలో సోమవారం ఫుడ్ ఫెస్టివెల్ నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వంటకాలు ఆకట్టుకున్నాయి. దాదాపు 120 రకాల వంటకాలను ప్రదర్శించినట్లు కరస్పాండెంట్ ఆయాజ్ తెలిపారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్, ఏఎంసీ వైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, పలువురు నాయకులు హాజరై వంటకాలను రుచి చూసి, విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరింప చేశాయి. కార్యక్రమంలో నాయకులు సబ్బని రాజమల్లు, గాజనవేన సదయ్య, మాదాసి సతీశ్, అరెల్లి రమేశ్, మునీర్, రవి, రాంచంద్రం తో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

పెద్దపల్లి, ఫిబ్రవరి24: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం సమర్పించారు. ఇక్కడ యూనియన్ నాయకులు విజయ్ కుమార్, జగన్, మహేశ్, ఫణి సుదర్శన్, వీరేశం, సాబీర్ పాషా, సతీశ్, సుమన్, పూసాల రవి, జంగపల్లి సాగర్, సల్వాల ప్రశాంత్, శ్రీనివాస్, శోభన్, ప్రభాకర్, స్వామి ఉన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 24: శివరాత్రి పండుగకు పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులకు గోదావరి నదిలోకి ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని ఫైట్‌ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ప్రభుత్వాన్ని కోరారు. పండుగ నేపథ్యంలో గోదావరి నదిలో పుణ్యస్నానాలకు నీరు లేనందున ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. అలాగే నది ఒడ్డున ఉన్న శివుని విగ్రహానికి రంగు వేయాలన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆత్మీయ సమ్మేళనం

సుల్తానాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24: సుల్తానాబాద్‌లోని నరహరి ఫంక్షన్ హాలులో సోమవారం మెదక్, ఆదిలాబాద్, నిజామబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరి కృష్ణ గౌడ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదింటి నుచి ఎదిగిన విద్యావంతుడనని, తన 19 ఏళ్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలి నిరుద్యోగుల గొంతు శాసన మండలిలో బలంగా వినిపించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. తనకు ఓటు వేసి ఆదరించాలని కోరారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మొలుగూరి అంజయ్య గౌడ్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ విఠల్, ఓయూ జేఏసీ నాయకుడు మహిపాల్ యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు పీ అజయ్ గౌడ్, కీర్తి లత, పురం రమణ, చంద్రమౌళి,శంకర్ ఉన్నారు.

లక్కారంలో ఉచిత కంటి వైద్య శిబిరం